చెప్పిందే చేస్తా... చేసిందే చెప్తా...

- తొమ్మిదిన్నర ఏళ్లుగా మీ అన్నగా. పెద్ద కొడుకుగా సేవ చేశా
- మరోసారి ఆశీర్వదించి గెలిపించండి
- మీ సేవకుడిగా పని చేస్తా...
- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

ఓల్డ్ బోయిన్‌పల్లి: చెప్పిందే చెస్తానని..చేసిందే చెబుతానని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ప్రజల వద్దకే మన ఎమ్మెల్యే పాదయాత్ర ముగింపు సందర్భంగా శనివారం సాయంత్రం ఓల్డ్ బోయిన్‌పల్లి చౌరస్తాలో కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రగతి నివేధన సభలో ఆయన మాట్లాడుతూ తొమ్మిదేళ్ల క్రితం నీళ్ల లేక అల్లాడుతున్న తరుణంలో కోట్లాది రూపాయలతో రిజర్వాయర్లను నిర్మించి నీళ్ల అందించామన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడా సంక్షేమ పథకాలు అమలు కావడం లేదన్నారు. ఎంపీ రేవంత్‌రెడ్డి ఒక్కసారైన ప్రజల వద్ద వచ్చారా అసలు కనిపించడా చెప్పాలన్నారు. ఇరవై నాలుగు గంటలు కరెంటు ఇస్తున్న ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేసి ఇంటింటికి డాక్టర్లను పంపుతున్నామన్నారు. నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో సొంత నిధులతో మూడు అంబులెన్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రోడ్లు, డ్రైనేజీలు, మంచినీటి పైపులైన్లు, ఫ్లైఓవర్లు, పార్కులు, స్మశాన వాటికల అభివృద్ధి చేశామన్నారు. బీజేపీ ప్రభుత్వం ఇంటికి రూ. 15 లక్షలు వేస్తామని చెప్పి జీరో ఖాతాలు తెరిపించి ఒక్కపైసా కూడా వెయ్యలేదన్నారు. వాళ్ల ప్రజలను ఉద్ధరిస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. కూకట్‌పల్లిలో వంద దేవాలయాలను అభివృద్ధి పరిచామని, రామ రామ అనే బీజేపీ నేతలు రామాలయం కట్టలేదని తాను వందేళ్ల చరిత్ర గల రామ మందిరాన్ని నిర్మించి చూపానన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

రూ. 20 కోట్లతో అభివృద్ధి పనులు..

డివిజన్‌లో మంచినీటి సరఫరా మెరుగు పర్చేందుకు మరో రూ. 20 కోట్ల నిధులు కావాలని అంచనా వేశామని కేటీఆర్‌తో చర్చించి నిధులు తెస్తానని హామీ ఇచ్చారు. అర్హులైన పేదలకు డబల్ బెడ్‌రూమ్‌లు అందిస్తామని ఇప్పుడు దరఖాస్తు చేసుకున్న వారికి వచ్చే సంవత్సరంలో ఇస్తామన్నారు. 60 సంవత్సరాల్లో జరగని అభివృద్ధి 9 ఏళ్లల్లో చేసి చూపామని గుర్తు చేశారు. పేదలు ప్రభుత్వ స్థలంలో ఇళ్ల కట్టుకుని ఉంటే వారికి రిజిస్ట్రేషన్లు చేసిస్తామని, రేకుల ఇళ్ల ఉన్న వారికి ఇళ్ల కట్టుకోవడానికి రూ. 3 లక్షల అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. పింఛన్లు రాని వారికి మార్చి నెలలోగా అందించే బాధ్యత తీసుకుంటానని చెప్పారు.

మరోసారి ఆశీర్వదించండి ..

మరోసారి ఆశీర్వదించి మూడోసారి అత్యధిక మెజార్టీతో గెలిపిస్తే మీ బాగోగులను నేను చూసుకుంటానన్నారు. ఎన్నికలు వస్తున్నాయని అది చేస్తాం ఇది చేస్తామని చెప్పే మాటలు నమ్మి మోసపోవద్దని నేను మీకు అండగా ఉంటానని నన్ను అదరించండి అని కోరారు. కార్యక్రమంలో 9 డివిజన్ల కార్పొరేటర్లు, నాయకులు నరేందర్‌గౌడ్, బల్వంత్‌రెడ్డి, మక్కాల నర్సింగ్‌రావు, సయ్యద్ ఏజాజ్, కర్రె జంగయ్య, కర్రె లావణ్య, లలితా, ఉదయరాణి, బుర్రి యాదగిరి, శ్రీనివాస్‌రెడ్డి, పోచయ్య, సుధాకర్‌రెడ్డి, సరోజు, రాజేశ్వరీ, రాజుగౌడ్, జహంగీర్, ఇబ్బు పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

పెండింగ్ పనులను పూర్తి చేయండి

పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను సెప్టెంబర్ నెలలోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే అధికారులను అదేశించారు. శనివారం ప్రజల వద్దకే మన ఎమ్మెల్యే కార్యక్రమంలో భాగంగా మల్లికార్జున నగర్, మనస సరోవర్ హైట్స్ ప్రాంతాలలో పాదయాత్ర నిర్వహించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాదయాత్రలో వచ్చిన సమస్యలపై చర్చించారు. మంచి నీటి సరఫరా విషయంలో ఫిర్యాదులు అందుతున్నాయని మంచినీటి పైపులైన్ల నిర్మాణం కోసం రూ. కోటి నిధులను విడుదల చేస్తున్నామని సెప్టెంబర్ లోగా పనులను పూర్తి చేసి నీటి సరఫరాకు అంతరాయం కలుగకుండా చూడాలని అధికారులకు సూచించారు. పెండింగ్‌లో ఉన్న రోడ్ల పనులు, డ్రైనేజీల నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశించారు.

అధికారులపై ఆగ్రహం

పాదయాత్రలో ఎక్కడికి అక్కడ చెత్త కుప్పలు దర్శనం ఇవ్వడంతో జీహెచ్‌ఎంసీ అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే చెత్త కుప్పలను తొలగించి పరిశుభ్రంగా ఉండేలా చూడాలని చెప్పారు. అంగన్ వాడీ సిబ్బంది, బస్తి దవాఖానా వైద్యులతో మాట్లాడుతూ గర్భిణీలకు నిరుపేదలకు అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్‌తో పాటు జీహెచ్‌ఎంసీ, పోలీసు, రెవెన్యూ, విద్యుత్, అరోగ్య విబాగాల అదికారులు పాల్గొన్నారు.


కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు



సమాజ అభివృద్ధికి పాటు పడాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

మోతీనగర్: స్వచ్ఛంద సేవా సంస్థలు సమాజ అభివృద్ధికి పాటుపడాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శనివారం మూసాపేట డివిజన్ బబ్బుగూడలోని ప్రభుత్వ ఉన్న పాఠశాలలో సినాప్సిస్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సోలార్ ప్లాంట్, డిజిటల్ ల్యాబ్‌లను సంస్థ ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన సొంత నిధులతో గత రెండేళ్లుగా నియోకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కిట్లను అందజేస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా పాఠశాలలకు స్థలాలు కేటాయించడంతో పాటు నిర్మాణాలు చేపట్టడం జరిగిందన్నారు. త్వరలో బబ్బుగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు స్థలాన్ని కేటాయించి, గదులు నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. ప్రభుత్వం విద్యార్థిని, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ప్రభుత్వం మధ్యాహ్న భోజనం, యూనిఫామ్‌లను ఉచితంగా అందజేస్తున్నదన్నారు. కూకట్‌పల్లి మండల స్థాయిలో మొదటి ర్యాంకు వచ్చిన విద్యార్థులకు రూ.లక్ష, అదే విధంగా నియోజవర్గంలోని ప్రభుత్వ పాఠశాల స్థాయిలో మొదటి ర్యాంకు వచ్చిన విద్యార్థులకు రూ.10 వేల చొప్పున పారితోషికం అందజేయనున్నట్లు తెలిపారు. ఈ ప్రక్రియ ప్రతి సంవత్సరం కొనసాగుతుందన్నారు. విద్యార్థులు ఇష్టపడి చదవాలని, తాను చదువుకున్న పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి ఆంజనేయులు, మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్, మాజీ కౌన్సిలర్ సత్యనారాయణ, నాయకులు మజీద్ ఖాన్, తన్నీరు తిరుపతిరావు, బోడ శ్రీనివాసరావు, ఉదయ్‌కుమార్, రాజుకుమార్ గౌడ్, విష్ణు వర్ధన్ రెడ్డి తదితరులుపాల్గొన్నారు.



ఆర్‌టీసీ కార్మికుల ధర్నా

మూసాపేట: కూకట్‌పల్లి బస్ డిపో వద్ద ఆర్‌టీసీ కార్మికులు శనివారం ధర్నా నిర్వహించారు. అనంతరం రాజ్‌భవన్ ముట్టడికి తరలి వెళ్లారు. దీంతో ఉదయం 10 వరకు బస్సులు డిపోకే పరిమితం అయ్యాయి. ఈ సందర్భంగా పలువురు కార్మిక నేతలు మాట్లాడుతూ ఆర్‌టీసీ విలీనంపై గవర్నర్ చేస్తున్న జాప్యానికి నిరసనగా ఈ ఆందోళన చేపట్టడం జరిగిందన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని 55 రోజుల సుదీర్ఘ సమ్మె చేసి 40 మంది కార్మికులు అమరులయ్యారన్నారు. వారి ఆశయాన్ని రాష్ట్ర ప్రభుత్వం నెరవేరుస్తున్నందుకు ఆనందంగా ఉందన్నారు. రాజకీయాలకతీతంగా తెలంగాణ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేయడానికి మీ వంతు సహాయ సహకారాలు అందిస్తూ ఫైల్‌ని ప్రభుత్వానికి పంపిచాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు అశోక్, మల్లారెడ్డి, ఐలయ్య, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.



హైటెక్ సిటీ రైల్వేస్టేషన్ శంకుస్థాపన పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న పన్నాల హరీష్ రెడ్డి, బీజేపీ నాయకులు

కూకట్‌పల్లి: అమృత్ భారత్ రైల్వే స్టేషన్ పథకంలో భాగంగా హైటెక్ సిటీ రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులను ఆదివారం ఉదయం 9 గంటలకు ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా హైటెక్ సిటీ రైల్వేస్టేషన్‌లో శంకుస్థాపనకు సంబంధించిన పనులను స్థానిక బీజేపీ నాయకులతో కలిసి శనివారం మేడ్చల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి పరిశీలించారు. కార్యక్రమంలో మూసాపేట కార్పొరేటర్ మహేందర్, అసెంబ్లీ కన్వీనర్ శ్రీకర్‌రావు, ప్రీతం రెడ్డి, జిల్లా నాయకులు సుగుణ చౌదరి, పి. సాయినాథ్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు గంధం రాజు, వినోద్‌గౌడ్, నాయకులు సుధ, పవన్, ప్రేమ్‌నాథ్, కళ్యాణ్, లక్ష్మీ, సుబ్బారావు, చంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలి



డిఐఈఓ కిషన్ నాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కూకట్‌పల్లి శ్రీ చైతన్య జూనియర్ కళాశాల విద్యార్థిని మానస అనుమానాస్పద మృతిపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులను కఠినంగా శిక్షించాలని ఎస్ఎఫ్ఐ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా ఇంటర్మీయట్ డీఐఈఓ కిషన్ నాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాథోడ్ సంతోష్ మాట్లాడుతూ శ్రీ చైతన్య కళాశాలలో ఎందరో విద్యార్థులు ఒత్తిడితో ప్రాణాలు కోల్పోయారన్నారు. శ్రీ చైతన్య కార్పొరేట్ కళాశాల ఒక బ్రాంచిపై గుర్తింపుపై వందల బ్రాంచీలు నిర్వహిస్తున్నా అధికారులు పట్టించుకోవటం లేదన్నారు. శ్రీ చైతన్య, నారాయణ కళాశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించటం లేదని, కనీసం భోజన వసతి కూడా సరిగ్గా లేవన్నారు. బోర్డు అధికారులు కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలన్నారు. లేని పక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి టి. అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

మోతీనగర్: నరేంద్రమోదీ తొమ్మిదేళ్ల సుపరిపాలనను పురస్కరించుకుని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చరణ్ చౌదరి ఆధ్వర్యంలో అల్లాపూర్ డివిజన్ పర్వత్‌నగర్‌ని నల్ల పోచమ్మ తల్లి దేవాలయంలో ఆదివారం మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ శిబిరంలో బీపీ, షుగర్, కంటి, దంత పరీక్షలు, ఇతర వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని స్థానిక ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శుభాకాంక్షలు...



కూకట్‌పల్లి: కూకట్‌పల్లి అసెంబ్లీ బీజేపీ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన కరీంనగర్ ఎంపి బండి సంజయ్‌కుమార్‌ను శనివారం మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కూకట్‌పల్లి నియోజకవర్గంలో చేపడుతున్న పార్టీ కార్యక్రమాలు, పాదయాత్రకు సంబంధించిన అంశాలు, ప్రజా స్పందన, నూతన చేరికలు, నియోజకవర్గ స్థాయిలో బీజేపీ బలోపేతానికి అనుసరిస్తున్న విధానాలను ఆయనకు వివరించారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ కాలనీలోని రోడ్డు నెంబర్ 2లోని ప్రభుత్వ ఎంపీపీ పాఠశాలలో శనివారం ఎన్ఎస్‌యూఐ ప్రెసిడెంట్ గణేష్ అధ్యక్షతన 300 మంది విద్యార్థులకు బుక్స్, షూస్ పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కాంగ్రెస్ పార్టీ మాజీ కార్పొరేటర్ గొట్టిముక్కల వెంగళరావు విద్యార్థులకు బుక్స్, షూస్ అందజేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ నేతలు సయాద్ మిస్బా, సునీల్ యాదవ్, వంశీ ముదిరాజ్, సాయి ప్రణతి, నిఖిల్, చందు, మణికంఠ, భారత్, ప్రభు కుమార్, ప్రవీణ, సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆలివ్ మిఠాయి అకడమిక్ ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానం

కూకట్‌పల్లి: ఆలివ్ మిఠాయి అకడమిక్ ఎక్సలెన్స్ అవార్డు ప్రదానోత్సవ వేడుక ఆదివారం కూకట్‌పల్లిలోని ఎస్‌కెఎన్ఆర్ గార్డెన్స్‌లో నిర్వహించనున్నట్లు ఆలివ్ మిఠాయి అధినేత దొర రాజు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో 10 వ తరగతి విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. 10వ తరగతి పరీక్షల్లో 10/10 పాయింట్లు సాధించిన బబ్బుగూడ జెడ్‌పీహెచ్ఎస్ విద్యార్థిని కార్తీక, శంషీగూడ విద్యార్థి దినేష్‌లకు రూ. లక్ష చొప్పున అందించనున్నారు. అన్ని పాఠశాలల్లో ప్రతి స్కూల్ టాపర్‌కు రూ.10 వేల చొప్పున నగదు బహుమతులు అందజేయనున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ప్రత్యేక అతిథిగా డీఈఓ విజయకుమారి, గౌరవ అతిథిగా ఎంఈఓ ఆంజనేయులు హాజరుకానున్నట్లు తెలిపారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన...




భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని హెచ్ఎంటి శాతవాహననగర్‌లో రూ.55 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను శనివారం కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదర్‌నగర్ డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. డివిజన్ అభివృద్ధికి శాయశక్తుల కృషి చేస్తానని, అన్ని వేళలా ప్రజలకు అందుబాటులో ఉంటానని, ఎవరికి ఎటువంటి సమస్య వచ్చినా నేరుగా సంప్రదించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ మహదేవ్, కాలనీ వాసులు అందే నర్సింహ, రామ కోటేశ్వరరావు, యాదిరెడ్డి, మదన్‌మోహన్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని రాజీవ్‌గాంధీ నగర్‌లో రూ. 7 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని, పెండింగ్ పనులన్నీ పూర్తి చేసి డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, కాశీనాద్ యాదవ్, ప్రధాన కార్యదర్శి గుడ్ల శ్రీనివాస్, జాన్, వాసుదేవరావు, ఇంతియాజ్, వెంకటేష్, ఏఈ శ్రావణి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదేశాల మేరకు శనివారం కూకట్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ సాయిబాబా అధికారులతో కలిసి కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో అన్ని విభాగాల అధికారులతో పాటు పార్టీ నాయకులు కూకట్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు సంతోష్, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, బస్తీ కమిటీ అధ్యక్షుడు రమణరెడ్డి, చంద్రశేఖర్, ప్రదీప్, వెంకట్‌రావు, శ్రీనివాస్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కలుషిత నీరు సరఫరా కాకుండా చర్యలు



బాలానగర్: ఫతేనగర్ డివిజన్ పరిధిలో గత కొద్ది రోజులుగా కలుషిత నీరు సరఫరా కాకుండా చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ అన్నారు. శివశంకర్ నగర్‌లో నీరు కలుషితమవుతున్నట్లు సమాచారం అందడంతో ఆయన సమస్యను వాటర్ వర్క్స్ మేనేజర్ అనిల్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం కాలనీలో పర్యటించారు. సమస్య పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం నూతన పైపులైన్‌ను పరిశీలించి నీటి సమస్యపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో నాయకుల బస్వరాజు, శ్రీను, సాయినాథ్ గౌడ్, షేక్ కరీం, సురేందర్ నాయుడు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు నేతల శుభాకాంక్షలు...



ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి మండల తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన జే. స్వామిని శనివారం పాపిరెడ్డినగర్ బస్తీ అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి భగవంతరెడ్డి, కోశాధికారి నర్సింహులు ముదిరాజ్, ఆలయ చైర్మన్ గడ్డం రాజేశ్వర్‌రెడ్డి, సీనియర్ నేతలు చర్ల రామకృష్ణారెడ్డి, ముత్యం వెంకట్‌రెడ్డి, ప్రేమకుమార్, కనకా రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.